

హిజ్రాలు తయారు చేసిన జ్యూట్ బ్యాగును అందుకుంటున్న మేయర్

## ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయం

**బంజారాహిల్స్, జూలై 12(ఆంధ్రజ్యోతి):** ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయమని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి కొనియాడారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ బంజారా ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్ నెం12లోని కళింగ కల్చరల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన బంజారా బజార్ ఎడిషన్ ఎగ్జిబిషన్‌ను శుక్రవారం మేయర్ విజయలక్ష్మి ప్రారంభించి మాట్లాడారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని సామాజిక సేవా కార్యక్రమాలకు ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు వినియోగించడం అభినందనీయమని, ఇది చాలా గొప్ప విషయమని అన్నారు. రెండు రోజులపాటు జరిగే ఎగ్జిబిషన్‌లో 65మంది మహిళలు వివిధ రకాల చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు అధ్యక్షురాలు మన్మీత్ తెలిపారు. ప్రత్యేకంగా హిజ్రాలు తయారు చేసిన జ్యూట్ బ్యాగులను ఇక్కడ విక్రయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు కార్యదర్శి సవిత, రోమాగాంధీ, అంజలి బన్సాల్, ఇందిరా డొచానియా, రష్మీ దోషి, ఉషాచౌదరి, నవనీతా సంఘి, వీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులకు బోనాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

## బోనాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలి: దానం నాగేందర్

**బంజారాహిల్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** అధికారులు, ప్రజలు సమన్వయంగా ఉంటూ బోనాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. బంజారాహిల్స్‌రోడ్డు నెంబరు 10లోని కొమురం భీం ఆదివాసీ భవన్‌లో శుక్రవారం బోనాల నిర్వాహణ చెక్కులను ఆలయాల నిర్వాహకులకు అందజేశారు. అనంతరం దానం నాగేందర్ మాట్లాడుతూ ఆలయ నిర్వాహకులు ప్రభుత్వం ఇస్తున్న డబ్బుతో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలన్నారు. బోనాల చెక్కులు రాని ఆలయాల నిర్వాహకులు అధికారులను సంప్రదించి తగిన ధృవీకరణ పత్రాలు అందచేయాలన్నారు. కార్యక్రమంలో షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి, కార్పొరేటర్ వనం సంగీతాయాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు, ఆలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.



ఆలయ నిర్వాహకులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని, కార్పొరేటర్ మహేశ్వరి

## బోనాల చెక్కుల అందజేత

**బేగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. బోనాల ఉత్సవాలకు సంబంధించి బేగంపేట డివిజన్‌లోని పలు ఆలయాలకు మంజూరైన చెక్కులను కార్పొరేటర్ టీ మహేశ్వరితో కలిసి ఎమ్మెల్యే ఆలయ నిర్వాహకులకు అందజేశారు. ఆలయాల్లో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా నిధులు మంజూరు చేయడం హర్షణీయమన్నారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ బన్సీలాల్‌పేటలోని ఆలయ నిర్వాహకుడు రవికుమార్‌కు చెక్కు అందజేశారు.

## దారి కాచి డబ్బు డిమాండ్.. ఇవ్వనందుకు దాడి

● నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**బంజారాహిల్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** దారి కాచి యువకుడిని అడ్డుకొని డబ్బు డిమాండ్ చేయగా, అతడు నిరాకరించడంతో దాడిచేసి గాయపరిచిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 10న బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 10 సింగాడిబస్తీ నుంచి ఓ యువకుడు నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి అడ్డగించాడు. రూ. 5 వేలు డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తన దగ్గర లేవని చెప్పడంతో అతడిపై దాడి ముఖం, కంటిపై పిడికిలి బిగించి కొట్టాడు. గాయాపడిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని సంఘటనా స్థలంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. దాడి చేసిన వ్యక్తి సింగాడికుంటకు చెందిన మహ్మద్ ఖాజా అలియాస్ షోయబ్‌గా గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా ఓ బ్లేడు, 2గ్రాముల గంజాయి లభించాయి. గంజాయి అలవాటు పడిన ఖాజా సైకోగా మారి డబ్బుకోసం దాడి చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ సామల వెంకటరెడ్డి తెలిపారు.

భార్య ముగ్గురు పిల్లలుండగా..

## మరో యువతితో రెండో వివాహం

● కేసు నమోదు చేసిన పోలీసులు

**యూసుఫ్‌గూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** భార్య ముగ్గురు పిల్లలు ఉన్న విషయాన్ని దాచిపెట్టి రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన యువతిని 2023, ఫిబ్రవరి నెలలో గంటే శివ పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలు ఎల్లారెడ్డిగూడెంలో నివాసం ఉంటున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి శివ ఇంటికి రావడం లేదు. ఫోన్ చేస్తే అసభ్యకరంగా భార్యను తిడుతున్నాడు. అతడికోసం భార్య వెతకగా ఖైరతాబాద్ శ్రీరాంనగర్‌లో ఉంటున్నట్టు తెలిసింది. గురువారం తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లి చూడగా ఇంటికి తాళం వేసి ఉంది. అనుమానం వచ్చి తలుపులు తెరచి చూడగా ఇంట్లో ఓ మహిళ ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఎవరు మీరని ప్రశ్నించగా శివ తన భర్త అని తెలిపింది. తనకు తొమ్మిదేళ్ల క్రితం శివతో పెళ్లి అయిందని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. బాధిత యువతి మొదటి పెళ్లి విషయాన్ని దాచిపెట్టి, తనను మోసం చేశాడని మధురానగర్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆగి ఉన్న బస్సు టైర్ ముందుకు వ్యక్తి

## డ్రైవర్ బస్సును స్టార్ట్ చేయడంతో మృతి

**యూసుఫ్‌గూడ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ఆగి ఉన్న బస్సును డ్రైవర్ స్టార్ట్ చేయడంతో దాని కింద ఉన్న గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్కే ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు అత్రేయపురం నుంచి నగరానికి వచ్చింది. శుక్రవారం తెల్లవారు జామున 5.20గంటలకు ఎస్సార్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద ప్రయాణికులను దించడానికి డ్రైవర్ బస్సును ఆపాడు. ఆ సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆగిఉన్న బస్సు కుడివైపు వెనుక టైర్ ముందుకు దూరాడు. గమనించని డ్రైవర్ బస్సును కదిలించడంతో చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతుడు యాచకుడు అయి ఉండొచ్చని పోలీసులు తెలిపారు.

## యువకుడి అదృశ్యం

**ఖైరతాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** టెంట్ హౌజ్‌లో పనిచేసే యువకుడు అదృశ్యమయ్యాడు. ఖైరతాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతలబస్తీ బుద్ధజంగం బస్తీకి చెందిన సద్దుల సునీల్ ఎసీ గార్డ్స్‌లోని ఓ టెంట్ హౌజ్‌లో పని చేస్తుంటాడు. ఈనెల 10వ తేదీన టెంట్ హౌజ్ తాళాలు ఇంట్లో పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబసభ్యులు ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# చల్లని తల్లికి పచ్చని హారం

● ప్రపంచాన్ని కరువు నుంచి కాపాడిన అమ్మగా ప్రసిద్ధి ● నేటి నుంచి జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి శాకాంబరీ ఉత్సవాలు



శాకాంబరీదేవిగా జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి(ఫైల్)



ఏర్పాట్లు నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

**బంజారాహిల్స్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** కొలిచిన వారికి కొంగు బంగారమై దీవెనలు ఇచ్చే జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి శాకాంబరీ ఉత్సవాలకు సిద్ధమవుతోంది. మూడురోజులపాటు నిర్వహించే ఉత్సవాలంటే అమ్మవారికి ప్రీతి అని పురాణాలు చెబుతున్నాయి. అసలు పచ్చదనం అనేది ఆధ్యాత్మికత నుంచే పుట్టిందని వేదపండితులు అంటున్నారు. అమ్మవారికి కూరగాయల అలంకరణ జరిపిన అనంతరం దేశంలో వర్షాలు విస్తారంగా కురుస్తాయని, ఇది వేల సంవత్సరాల నుంచి అనవాయితీగా వస్తుందని చెబుతున్నారు.

**మూడు రోజుల పాటు...**

ఆషాడమాసం ప్రారంభం కావడంతో ఈ నెల 13 నుంచి మూడు రోజుల పాటు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించనున్నారు. రోజూ అమ్మవారికి ప్రత్యేక అభిషేకంతోపాటు పూజలు, సాయంత్రం పల్లకిసేవ నిర్వహిస్తారు. 14న సామూహిక లలితాసహస్రనామ కుంకుమార్చన చేయనున్నారు. 15న అమ్మవారికి పల్లకి సేవ నిర్వహించనున్నారు.

**వెయ్యి కిలోల కూరగాయలతో..**

అమ్మవారి శాకాంబరీ ఉత్సవాలు నిర్వహించేందుకు రోజుకు టన్ను కూరగాయలు ఉపయోగించనున్నారు. బెండకాయ-300, దొండ-150, ఆలుగడ్డ-100, బీరకాయ-170, వంకాయ-300, బిన్నీస్- 10, దోసకాయ-20, కాకర-80 కేజీలు ఉపయోగిస్తారు. గోబీపువ్వు, పాలకూర, బచ్చలి, గోంగూర, తోట, సుక్క కూర ఆకులతో అలంకరణకు చేస్తారు. ఇవి పాడవ్వకుండా ప్రత్యేక ప్లాస్టిక్ సంచుల్లో పెట్టి పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు వితరణ చేయనున్నారు. చివరి రోజు మరో 500 కేజీల కూరగాయలు పెరుగుతాయి.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం: గోపీనాథ్



వెంగళరావునగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

**పంజాగుట్ట,జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ అన్నారు. వెంగళరావునగర్ కాలనీ పోస్ట్ ఆఫీస్ వద్ద రూ. 35 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దేదీప్యరావు, జీహెచ్ఎంసీ డీఈ రామచంద్ర రాజు,ఏఈ అవినాష్, స్థానిక నాయకులు నర్సింగ్‌రావు, అర్జున్, ముత్తయ్య, బీఆర్ఎస్ నాయకులు శ్యామ్‌రావు, సునీత,విజయ్ ముదిరాజ్, వేణు, అంజనేయులు,ఏ.రామకృష్ణ, బాలరాజు,కె. లక్ష్మితదితరులు పాల్గొన్నారు.

**పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**ఎర్రగడ్డ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సూచించారు. శుక్రవారం ఎర్రగడ్డలోని చెస్ట్ హాస్పిటల్‌లో ఆయన డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఇస్లావత్ నాయక్, డిప్యూటీ డైరెక్టర్ అనిల్‌కుమార్ తదితర అధికారులతో కలిసి వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి మాట్లాడారు. కాంక్రీట్ జంగల్‌గా మారుతున్న నగరంలో మొక్కలు నాటాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్యరహిత వాతవరణాన్ని అందించాలంటే మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్‌ఖాన్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు, అధికారులు యూసుఫ్‌పాషా, ఆలీ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విస్తృత చర్చ జరిపిన తరువాతే చట్టాలు చేయాలి

● మౌలిక హక్కులను ప్రమాదంలోకి నెట్టేసేలా నూతన చట్టాలు: వక్తలు

**పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** రాజ్యాంగంలోని మౌలిక హక్కులను ప్రమాదంలోకి నెట్టేసేలా కొత్తచట్టాలు రూపొందించడం సరికాదని వక్తలు అన్నారు. విస్తృత చర్చ జరిపిన తరువాతే చట్టాలు చేయాలన్నారు. నూతన నేర చట్టాలకు వ్యతిరేకంగా న్యాయపరమైన పోరాటం చేస్తూనే వీధుల్లోకి వెళ్లి పోరాటం చేయాలని వారన్నారు. సెక్యులర్ డెమోక్రటిక్ ఫోరం, ఇన్ఫార్మల్ లేబర్స్ వర్కర్స్(ఐఎల్‌డబ్ల్యుఎఫ్)వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'కొత్త నేరచట్టాలు రద్దు చేసుకోవాలి, మానవ హక్కులను కాపాడుకోవాలి' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఫెడరేషన్ ఛైర్మన్ ఇనాయత్ అలీబాక్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, జస్టిస్ పి.ఎస్.నారాయణ, ఆర్టీఐ మాజీ జాతీయ కమిషనర్ ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, న్యూడెమొక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గోవర్ధన్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

చట్టాలు చేసే సమయంలో వాటిపై విస్తృతంగా చర్చ జరగాలని, నిష్ణాతులైన వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని, పార్లమెంట్ ఉభయ సభల్లో చర్చించిన తరువాత అందరి అభిప్రాయాలను తీసుకొని చట్టాలు రూపొందించాలే కానీ రాజ్యాంగంలోని మౌలిక హక్కులను ప్రమాదంలోకి నెట్టేసేలా చట్టాలు రూపొందించడం మంచిది కాదన్నారు. పార్లమెంటులో మూడు కొత్త నేర చట్టాలను ప్రవేశపెట్టి ఎలాంటి చర్చకు అవకాశం ఇవ్వకుండా ప్రతిపక్షాలు సభలో లేకుండా చేసి వాటిని ఆమోదింపచేసుకుందని ఆరోపించారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సొగరా బేగం, నాగరాజు, మీర్ కుర్రామ్ అలీ, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ‘భూ’ మాయ!

● రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు

● నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

**(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి):** నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ మొత్తం వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

**1975 నుంచి రికార్డులు గల్లంతు**

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్ల ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975 నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. అయితే, 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరి పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

## ఎస్కీకి గ్రీన్ అవార్డు, ఐఎస్‌వో సర్టిఫికేట్



అవార్డు, సర్టిఫికేట్ అందుకుంటున్న ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వర్‌రావు తదితరులు

**ఖైరతాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)కి గ్రీన్ అవార్డు దక్కింది. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శివరాం ఆలపాటి సంస్థ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావుకు సర్టిఫికెట్‌ను అందజేశారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి సహజంగా ఏర్పడ్డ వనరులను కాపాడుకోవడం, సుందరీకరించడం, భారీ వృక్షాలు, అటవీ సంపదను కాపాడడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని గ్రీన్ అవార్డుతోపాటు ఐఎస్‌ఓ సర్టిఫికెట్లను అందజేశారు.



మాజీ కార్పొరేటర్, బీజేపీ సీనియర్ నాయకులు కంజర్ల సదాశివయాదవ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయనను అభినందిస్తున్న ప్రకాశం జిల్లా ఎమ్మెల్యే విజయ్, దేరంగుల ప్రసన్న, భానుప్రసాద్, దేరంగుల వెంకటేశ్వరరావు, శ్రీ దుర్గ ఎస్టేట్స్ డైరెక్టర్ దేరంగుల శ్రీనివాస్, మేనేజింగ్ డైరెక్టర్ కె. పూర్ణచంద్రరావు తదితరులు.

- (ఎర్రగడ్డ, జూలై 12, ఆంధ్రజ్యోతి)

## విద్యార్థులకు అన్ని రంగాలపైనా అవగాహన ఉండాలి: మోహన వంశీ



బిస్కెట్ ఫ్యాక్టరీని సందర్శించిన సంస్కార్ ది లైఫ్ స్కూల్ విద్యార్థులు

**ఎర్రగడ్డ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** విద్యార్థులకు అన్నిరంగాలపైనా అవగాహన ఉండాలని, అప్పుడే వారు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటారని సంస్కార్ ది లైఫ్ స్కూల్ ఫౌండర్ సీఈవో ఏ మోహనవంశీ అన్నారు. శుక్రవారం విజ్ఞానయాత్రలో భాగంగా స్కూల్ విద్యార్థులు బిస్కెట్ ఫ్యాక్టరీని సందర్శించారు. విద్యార్థులకు బిస్కెట్లు తయారు చేసే విధానం, వాటిలోని పోషక పదార్థాలు, విలువలు తదితర విషయాలను ఫ్యాక్టరీలో వీడియో రూపంలో చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ విషయాన్ని విద్యార్థులు క్షుణ్ణంగా పరిశీలించినప్పుడే జ్ఞాపకశక్తి, సృజనాత్మకత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మధుమతి, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 4న గచ్చిబౌలి స్టేడియం వద్ద

## 10కే, 5కే రన్,10కే సైక్లింగ్

**పంజాగుట్ట,జూలై 12 (ఆంధ్రజ్యోతి):** స్పైనల్ మస్కులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ)వ్యాధిపై అవగాహన కల్పించేందుకు క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 4న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వద్ద రెండో ఎడిషన్ 5కే, 10కే అవగాహన రన్, 10కే సైక్లింగ్ జరుగనుంది. శుక్రవారం ఎర్రమంజిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రెయిన్‌బో ఆస్పత్రి పిల్లల వైద్యులు డాక్టర్ రమేష్ కోనంకి, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ ఆస్పత్రికి చెందిన క్లినికల్ జెనిటిసిస్ట్ డాక్టర్ తెల్లా సునిత, క్యూర్ ఎస్ఎంఏ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సహ వ్యవస్థాపకురాలు,పేషెంట్ అడ్వకేసీ డైరెక్టర్ శ్రీలక్ష్మీ నాళం,సంస్థ రీజినల్ కో-ఆర్డినేటర్ పి.సతీష్,ఎన్.వి రామారావు తదితరులు 5కే, 10కే అవగాహన రన్, 10కె సైక్లింగ్ పోస్టరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'వెన్నెముక కండరాల క్షీణత అనేది జన్యుపరమైన వ్యాధి, ఇది వెన్నుపాములోని మోటారు నరాల కణాలను బలహీనపరుస్తుందని, శారీరక బలం, నడవడానికి, తినడానికి లేదా శ్వాస తీసుకునే సామర్థ్యాన్ని కోల్పోతుందని' తెలిపారు. ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన రావాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు.

## ప్రజావాణికి 546 దరఖాస్తులు

**బేగంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** మహాత్మ జ్యోతి బాపూలే ప్రజాభవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి శుక్రవారం 546 దరఖాస్తులు వచ్చాయి. ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య, డాక్టర్ చిన్నారెడ్డి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, వారి సమస్యలు అడిగి తెలుగుసుకున్నారు. రెవెన్యూకు చెందిన 115, పౌరసరఫరాలకు చెందిన 79, విద్యుత్‌శాఖకు సంబంధించి 50, హౌజింగ్ సంబంధించి 64, మైనార్టీ సంక్షేమశాఖకు చెందిన 41, ఇతర శాఖలకు చెందిన 197 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ శ్రీనివాస్ తెలిపారు. మెహర్ బాబా ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంట వరకు, రామానాయుడు స్టూడియో ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, కాకతీయ హిల్స్ ఫీడర్ పరిధిలో 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, జర్నలిస్టు కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంట వరకు, బంగారు మైసమ్మ ఆలయం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

తపాలా శాఖ సేవలను

## సద్వినియోగం చేసుకోవాలి: పోస్ట్ మాస్టర్

**పంజాగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఖైరతాబాద్ అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ ఈ.నర్సింగ్‌రావు, పబ్లిక్ రిలేషన్ అధికారి సప్తరి వాసులు అన్నారు. శుక్రవారం ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో 'తపాలా శాఖ అందిస్తున్న సేవలు, పథకాల'పై అవగాహన కార్యక్రమం జరిగింది. తపాలశాఖలోని పథకాల గురించి వివరించి, ప్రజలకు దరఖాస్తులను అందించారు. సుకన్య సమృద్ధి యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనతోపాటు సేవింగ్ అకౌంట్‌ల గురించి వివరించారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి కె.భగవాన్‌దాస్, అంగన్‌వాడీ సెంటర్ ఇన్‌చార్జి మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ‘జీవో 178ను రద్దు చేయాలి’

**ఎర్రగడ్డ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ఉద్యోగులను ఇబ్బందులపాలు చేసేలా ఉన్న జీవో 178ను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని టీఎన్జీవో ఆయుష్ సంఘాల నాయకులు, ఉద్యోగులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎర్రగడ్డలోని ఆయుర్వేద కళాశాలలో ఉద్యోగ సంఘాల నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా టీఎన్జీవో ఆయుష్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టిఎస్.చారి మాట్లాడుతూ జీవో 178ను వెంటనే రద్దుచేసి పాత పద్ధతిలోనే పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం 2021లో బదిలీలు, పదోన్నతుల కోసం 178 జీవోను తెచ్చిందని అన్నారు. ఆ జీవోను అడ్డుపెట్టుకుని కొందరు అధికారులు ఉద్యోగులకు తెలియకుండా పదోన్నతుల జాబితా విడుదల చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, కళాశాల ఉద్యోగులు పాల్గొన్నారు.

## మధురానగర్ బస్తీ ఎన్నికలో ఉద్రిక్తత

● ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

**బోరబండ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** మధురానగర్ బస్తీ ఎన్నికలు ఈ నెల 14న జరగనున్నాయి. శుక్రవారం నామినేషన్ చివరి రోజు కావడంతో ఎన్నికల అధికారి లోకల్, నాన్ లోకల్ అనే విషయంలో అధికార పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ వర్గాల మధ్య ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, ప్రస్తుత కార్పొరేటర్, మాజీ డిప్యూటి మేయర్ బాబా ఫసియుద్దీన్ వారి అనుచరులతో పోలీస్ స్టేషన్‌కు వెళ్లి జరిగిన సంఘటనపై ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

సాలార్జంగ్ కంచె భూములను

## కొనుగోలు చేయొద్దు: అబ్దుల్ వాహబ్

**పంజాగుట్ట,జూలై 12 (ఆంధ్రజ్యోతి):** పీర్జాదిగూడలో వివాదాస్పదమైన ప్రభుత్వ సంరక్షణలో ఉన్న సాలార్జంగ్‌కు చెందిన స్థలాలను ఎవరూ కొనుగోలు చేయవద్దని సాలార్జంగ్ బావమరిది అబ్దుల్ వాహబ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యాయవాది జి.జితేందర్ రెడ్డి,సామాజిక కార్యకర్తల బొల్లం లక్ష్మణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నిజాం తదనంతరం ప్రధానిగా పనిచేసిన సాలార్జంగ్‌కు పీర్జాదిగూడ ప్రాంతంలో 362.15 ఎకరాల స్థలం ఉందన్నారు. సదరు స్థలంపై కొందరు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి విక్రయిస్తున్నారని అన్నారు. స్థలాలను కొనుగోలు చేసిన వారు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. క్రయవిక్రయాలను ఆపాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ దుస్థితి నెలకొందన్నారు. గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూవిక్రయాలు జరగకుండా అడ్డుకట్ట వేసి పేద, మధ్య తరగతి ప్రజలు మోసపోకుండా కాపాడాలని కోరారు. ఈ విషయమై త్వరలోనే ప్రభుత్వ పెద్దలను కలుస్తామని అన్నారు.



చేనేత వస్త్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వస్త్రాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న వినియోగదారులు

### తార్నాక ఐఐసిటీ స్టాఫ్ క్లబ్‌లో
## ఆకట్టుకుంటున్న చేనేత హస్తకళా ప్రదర్శన

**తార్నాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** నగర ప్రజలకు ప్యాషన్ వస్త్రాలను ఒకే వేదికపై అందించేందుకు కళాసిల్క్ సొసైటీ ఆధ్వర్యంలో తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన చేనేత హస్తకళా ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంటుంది. తెలంగాణ సంస్కృతికి అద్దంపట్టే పోచంపల్లి చీరలు, బెడ్ షీట్స్, వెస్ట్ బెంగాల్ జాంధాన్ని చీరలు, రాజస్థానీ కోటా చీరలు, మంగళగిరి, ఉప్పాడ, చీరాల, వెంకటగిరి, ధర్మవరం చీరలు, కలంకారి చేనేత డ్రెస్ మెటీరియల్, లక్నో చెకెన్ వర్క్ కుర్తీస్, వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు, తిరోక్ వస్త్రాలు ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయని ఎగ్జిబిషన్ నిర్వాహకులు వికాస్‌జైన్ శుక్రవారం తెలిపారు. ఈ చేనేత హస్తకళా ప్రదర్శన జూలై 22వరకు తార్నాకలోని ఐఐసీటీ స్టాఫ్ క్లబ్‌లో కొనసాగుతుందని, నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకుని చేనేత హస్తకళలను మరింత ప్రోత్సహించాలని కోరారు.



ఎన్‌సీసీ కెడెట్స్‌తో గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్

## కెడెట్స్‌ను సత్కరించిన ఎన్‌సీసీ గ్రూప్ హైదరాబాద్

**అల్వాల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన థాల్ సైనిక్ క్యాంప్ ఇంటర్ గ్రూప్ పోటీలో విజయం సాధించిన 51 మంది కెడెట్స్‌ను శుక్రవారం ఎన్‌సీసీ గ్రూప్ హైదరాబాద్ సత్కరించింది. జూలై 1 నుంచి 10 వరకు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురంలో నిర్వహించిన ఈ ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏపీ, తెలంగాణకు చెందిన మొత్తం 9 గ్రూప్ టీమ్‌లు పాల్గొన్నాయి. హైదరాబాద్ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి గ్రూప్ కమాండర్ కల్నల్ అనిల్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కెడెట్స్ క్రమశిక్షణతో పాటు అసాధారణమైన నైపుణ్యాన్ని ప్రదర్శించారని ఆయన కొనియాడారు. పట్టుదలతో విజయాన్ని సాధించడంలో కెడెట్స్ జట్టు కోసం చేసిన కృషిని కల్నల్ అనిల్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన కెడెట్స్‌కు బహుమతులను ప్రదానం చేశారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన లాన్స్ కార్పొరల్ అభిషేక్, కెడెట్స్ మేఘన, అర్పిత్ యాదవ్, సాయికుమార్‌లను, కాంస్యపతకాలు సాధించిన కార్పొరల్ తనుష్క, కెడెట్ సయ్యద్ వాసిఫ్‌లను కల్నల్ అనిల్ ప్రత్యేకంగా అభినందించారు.



కళామారుతి వేదికను ప్రారంభిస్తున్న జనార్దనమూర్తి, పాలకవర్గసభ్యులు

## గానసభలో మరో కళావేదిక ప్రారంభం

**చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** త్యాగరాయగానసభలో గతంలో నాలుగు వేదికలపై సంగీత, నృత్య, నాటక, సాహిత్య కార్యక్రమాలు జరిగేవి. వీటికి తోడుగా మరో కళావేదికను శుక్రవారం ప్రారంభించారు. గానసభ మొదటి అంతస్థులో కళా మారుతి వేదికను గానసభ పాలకవర్గసభ్యులు అధ్యక్షుడు కళా జనార్దనమూర్తితో కలిసి ప్రారంభించారు. కళాకారులకు వేదికలను సౌకర్యాలతో అందిస్తున్నామని, 365 రోజులు సినీ గీతాలు, కమర్షియల్ కార్యక్రమాలు తప్ప అన్నింటికి ఉచితంగా ఇస్తున్నామని జనార్దనమూర్తి తెలిపారు. హాస్యావధాని, జర్నలిస్ట్ శంకరనారాయణ మాట్లాడుతూ.. వేదికలు ఎన్ని ఉన్నా కొరత ఉందని, కళాకారులు గానసభ వేదికలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలకవర్గసభ్యులు గుండవరపు విద్యాసాగర్, జంగంరావుగౌడ్, గుండవరపు గీతాదేవి, చక్రపాణి, ప్రసాద్, భమిడి ఉష, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సంచాలన్ భవన్ వద్ద ధర్నాలో పాల్గొన్న మజ్దూర్ యూనియన్ రైల్వే ఉద్యోగులు

## పాత పెన్షన్ అమలుచేసేవరకు పోరాటం

**అడ్డగుట్ట, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు రైల్వే మజ్దూర్ యూనియన్ నిరంతరం పోరాటం చేస్తుందని దక్షిణమధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ తెలిపారు. పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని కోరుతూ మజ్దూర్ యూనియన్ నేతలు, రైల్వే ఉద్యోగులు శుక్రవారం సికింద్రాబాద్ సంచాలన్ భవన్ ఎదురుగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు మజ్దూర్ యూనియన్ పోరాటం చేస్తుందన్నారు. రైల్వే కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని ఎఐఆర్‌ఎఫ్ పిలుపు మేరకు ధర్నా చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ డివిజనల్ కార్యదర్శి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర్, జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు మురళీధర్, కోశాధికారి సరోజినీరెడ్డి, డివిజనల్ అధ్యక్షుడు వరప్రసాద్, ఖాజాబాబా నవీన్‌కుమార్, సీయిఎస్ అధ్యక్షుడు చిలుకస్వామి, నర్సింహారెడ్డి, నాగలక్ష్మి, రాంమోహన్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

## ప్రభుత్వ పాఠశాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

**బౌద్ధనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** సీతాఫల్‌మండి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ఫ్రైడే.. డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ సామల హేమ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపులు, పూలకుండీలు, రిఫ్రిజిరేటర్లు, నీటి నిల్వ ఉండే ప్రాంతాల వలన దోమల వృద్ధికి దారితీసే అవకాశాలున్నాయని, నీటి నిల్వ కంటైనర్‌లను వారానికొకసారి శుభ్రపరచాలని, అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం వలన డెంగ్యూ, మలేరియా, ఇతర వ్యాధులను నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ ఏఈ సునీత, శ్రీనివాస్, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# 484 ఆలయాలు.. రూ.2.29కోట్లు

- బోనాల నేపథ్యంలో చెక్కుల పంపిణీ
- సనత్‌నగర్‌లో తలసాని.. కంటోన్మెంట్‌లో శ్రీగణేష్ అందజేత

సికింద్రాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): **బోనాల నేపథ్యంలో జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆలయాలకు నిధులను విడుదల చేసింది. సనత్‌నగర్ నియోజకవర్గంలోని ఆలయాలకు రూ.1.69కోట్లు, కంటోన్మెంట్ నియోజకవర్గానికి రూ.60లక్షల నిధులు అందజేశారు.**



చెక్కులు పంపిణీ చేస్తున్న రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, తలసాని

సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం స్థానిక శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ సనత్‌నగర్ నియోజకవర్గంలోని 266 దేవాలయాలకు 1.69కోట్ల రూపాయలను చెక్కుల రూపంలో అందచేశారు. డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సంధ్యారాణి, కార్పొరేటర్లు చీర సుచిత్ర, కొంతం దీపిక, మహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు అత్తెల్లి మల్లికార్జున్‌గౌడ్, కోశికె కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల నుంచి వచ్చిన ప్రతినిధులకు చెక్కులు అందజేశారు.

### నేడు తలసాని పర్యటన

ఈనెల 21, 22వ తేదీల్లో లష్కర్ బోనాల జాతర నేపథ్యంలో శనివారం స్థానిక సనత్‌నగర్ శాసనసభ్యుడు, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం, పరిసరాల్లో పర్యటించనున్నారు. బోనాల జాతరను అత్యంత ఘనంగా, ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్వహించడానికి తీసుకోవలసిన చర్యలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేపట్టవలసిన ముందు జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించనున్నారు. జీహెచ్‌ఎంసీ, దేవాదాయ, వాటర్ బోర్డు, విద్యుత్, వైద్య, ఆరోగ్య, పోలీసు, ట్రాఫిక్, అగ్నిమాపక తదితర శాఖల అధికారులతో తలసాని విస్తృతంగా చర్చించనున్నారు.

### కంటోన్మెంట్‌లో..

**మారేడుపల్లి :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజల పండుగలను గౌరవిస్తుందని కంటోన్మెంట్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. శుక్రవారం మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ ప్రాంగణంలో బోనాల ఉత్సవాల నిర్వహణ కోసం నియోజకవర్గ పరిధిలోని 218 ఆలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.60లక్షల చెక్కులను ఆలయ కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఈఓ రవికాంత్, భద్రన్న, నాయకులు ముప్పిడి మధుకర్, ధనలక్ష్మి, సరిత, శ్యాంసుందర్‌రెడ్డి, సి. సంతోష్ యాదవ్, జి.రాజు, మారేడుపల్లి డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్, తిరుమలగిరి తహసీల్దార్ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కమిటీ సభ్యులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

### 24, 25 తేదీల్లో లాల్‌బజార్ జాతర

**తిరుమలగిరి :** లాల్‌బజార్‌లోని శ్రీమహంకాళి దేవాలయం బోనాల జాతరకు నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈనెల 24, 25 తేదీన బోనాల జాతర జరగనున్న నేపథ్యంలో దేవాలయం రంగురంగుల అమ్మవారి ప్రతిరూపాలను గోడలకు పెయింటింగ్ వేస్తున్నారు. సర్వాంగసుందరంగా దేవాలయాన్ని తీర్చిదిద్దడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. గత సంవత్సరంకంటే ఈ సంవత్సరం బోనాల జాతరను నిర్వహించడానికి సర్వం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ రవికిరణ్

## అవగాహన, మెరుగైన విధుల ద్వారా డెంగీ నివారణ

- జోనల్ కమిషనర్ రవికిరణ్

**సికింద్రాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** అటు అవగాహన కల్పించడం, ఇటు క్షేత్రస్థాయిలో మెరుగైన విధులు నిర్వహించడం ద్వారా డెంగీ నివారణకు అధికారులు, ఉద్యోగులు కృషిచేయాలని జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డెంగీ నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తల గురించి శానిటేషన్ మెడికల్ ఆఫీసర్లకు, డిప్యూటీ కమిషనర్లకు, డిప్యూటీ ఈఈలకు, సీనియర్ ఎంటమాలజిస్టులకు, అసిస్టెంట్ ఎంటమాలజిస్టులకు పలు సూచనలు చేశారు. డెంగీ నియంత్రణ కార్యాచరణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. ప్రతి శుక్రవారం, శనివారం పాఠశాలల విద్యార్థులకు డెంగీ నియంత్రణపై అవగాహన కార్యకలాపాలు తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై మొబైల్ ద్వారా ప్రజలకు పెద్ద ఎత్తున సందేశాలు పంపించాలని తెలిపారు. అన్ని లైన్ డిపార్ట్‌మెంట్లతోపాటు డీసీలు, ఏఎంఓహెచ్‌లు, ఎస్‌ఈఎస్‌లు, ఏఈలతో అన్ని కార్యాలయాల్లో వారానికోసారి సమావేశాలు నిర్వహించాలని సూచించారు.



సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో డ్రగ్ మహమ్మారి పోస్టర్ ఆవిష్కరణ

## డ్రగ్ మహమ్మారి పోస్టర్ ఆవిష్కరణ

**చిక్కడపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** డ్రగ్ మహమ్మారిని దూరం చేసేందుకు అందరూ కలిసికట్టుగా కదలిరావాలని కోరుతూ సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సాయిఈశ్వర్‌గౌడ్ ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించి పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నార్కోటిక్ డీఎస్పీ బిక్షపతి, ఇన్‌స్పెక్టర్ సామ్యానాయక్, జీఆర్‌పీ ఎస్సై మాజీద్, రమేష్ పాల్గొన్నారు

## యువకుడి అవయవదానం

### ఆరుగురి జీవితాల్లో వెలుగులు



మెట్టు ప్రవీణ్(ఫైల్)

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** తాను చనిపోతూ దానం చేసిన అవయవాలతో ఆరుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు కామారెడ్డికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి మెట్టు ప్రవీణ్ (27). మంగళవారం తన బైక్‌ను పార్క్ చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తలకు గాయం కావడంతో వెంటనే అతడిని కొంపెల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు. మెరుగైన చికిత్స కోసం సూరారంలోని మరో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. నాలుగు రోజులు గడిచినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మెరుగుదల కనిపించలేదు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారుజామున బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. దీంతో జీవన్‌దాన్ సభ్యులు బాధితుడి కుటుంబసభ్యులతో అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో అతడి నుంచి కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, కార్నియాలను సేకరించారు. అవసరమైన ఆరుగురు బాధితులకు వాటిని అమర్చారు.




అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ సుభాష్

## దోమలు వృద్ధి చెందకుండా పటిష్ఠమైన చర్యలు

- జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి

**తార్నాక, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** నగరంలో దోమలు వృద్ధి చెందకుండా అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టనున్నట్లు జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. దోమలు వృద్ధి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శుక్రవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి తార్నాకలోని తన క్యాంపు కార్యాలయం ప్రాంగాణంలో డిప్యూటీ మేయర్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఇప్పటి నుంచి ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే పేరుతో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక యంత్రాలు, పనిముట్లను ఉపయోగించి దోమల వ్యాప్తిని అరికట్టేందుకు కృషిచేయాలని, అదేవిధంగా స్థానిక ప్రజలు వారంలో ఒక రోజు తమ ఇంటి పరిసరాలను, పాత్రలను శుభ్రం చేసుకోవడానికి కేటాయించాలని, తద్వారా దోమలు, కీటకాలు వృద్ధి చెందకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుభాష్, ఎఎంహెచ్‌ఓ రజనీకాంత్, ఏఈ సునీత, ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమగ్ర కులగణనకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి

- 14న కామారెడ్డి నుంచి కరీంనగర్ వరకు యాత్ర
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు, జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

**బర్కత్‌పుర, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచే వరకు తమ పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, విశ్రాంత ఐఏఎస్ అధికారి చిరంజీవులు అన్నారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన బీసీ, మహిళా, విద్యార్థి యువజన సంఘాల సమావేశంలో సమగ్రకుల గణన సాధనయాత్ర వాల్‌పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 14న కామారెడ్డిలో సమగ్ర కులగణన సాధన యాత్ర ప్రారంభమై 15 రోజులపాటు 10 జిల్లాల గుండా సాగి కరీంనగర్‌లో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని 136 బీసీ సంఘాలు ఈ యాత్రలో పాల్గొంటున్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ డిక్లరేషన్ ప్రకటించిన కామారెడ్డి నుంచే ఈ యాత్ర ప్రారంభిస్తున్నామని ప్రభుత్వం కళ్లు తెరిపించడానికే ఈ యాత్ర సాగుతుందన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి బీసీ కమిషన్ నియమించిన తర్వాతనే కులగణన చేపడతామని ప్రకటించారని దానిని స్వాగతిస్తున్నామన్నారు. కులగణన ప్రక్రియను నెల రోజుల్లో పూర్తి చేసి జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలలో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన ప్రక్రియ ప్రారంభమయ్యే వరకు ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. బీసీ మేధావులు, కుల సంఘాలు, విద్యావంతులు, మహిళలు పెద్దఎత్తున ఈ యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కుందారం గణేషాచారి, వేముల వెంకటేష్, ఉప్పర శేఖర్ సగర, తాటికొండ విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్‌కుర్మ, మహేష్‌యాదవ్, మణిమంజరి, నర్సింహనాయక్, మల్లికార్జున్‌యాదవ్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



దీజీపీగా బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెబుతున్న ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి, తదితరులు.

- మారేడుపల్లి,ఆంధ్రజ్యోతి

## నేడు రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరనున్న తెలంగాణ ఎక్స్‌ప్రెస్

**సికింద్రాబాద్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** హైదరాబాద్-న్యూఢిల్లీ మధ్య నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ (రైల్ నెంబర్: 12723) శనివారం రెండు గంటలు ఆలస్యంగా బయల్దేరనున్నట్టు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. హైదరాబాద్ నుంచి ఉదయం 6.00గంటలకు బయల్దేరవలసిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఉదయం 8.30గంటలకు బయల్దేరుతుందని అధికారులు వెల్లడించారు.

## పెళ్లి ఇష్టం లేక... ఇంటి నుంచి వెళ్లిపోయిన యువతి

**బౌద్ధనగర్, జూలై 12(ఆంధ్రజ్యోతి):** పెళ్లి ఇష్టంలేని ఓ యువతి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం... పార్శీగుట్టకు చెందిన రొయ్యల శ్రావణి(28)కి ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. అయితే పెళ్లి ఇష్టంలేని శ్రావణి ఈనెల తొమ్మిదవ తేదీ రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. యువతి కోసం కుటుంబసభ్యులు పలుచోట్ల గాలించినా ఫలితం లేదు. దీంతో తండ్రి రాజు తనకుమార్తె కనిపించటం లేదని గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్లపై అక్రమ పార్కింగ్ చేస్తే కేసులు

**బోయిన్‌పల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా రోడ్లపైన, ఫుట్‌పాత్‌లపైన అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తే కేసులు తప్పవని బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య హెచ్చరించారు. రోడ్లపైన అక్రమ పార్కింగ్‌లపైన రెండు రోజులపాటు సాయంత్రం స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ డ్రైవ్‌ను బోయిన్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు ఇన్‌స్పెక్టర్ నాగయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ క్రమంలో బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ వద్ద ఉన్న ఓ మద్యం దుకాణం వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ రోడ్లపైన నిలిపిన సుమారు 42 వాహనాలను గుర్తించి వాటి యజమానులపైన కేసులు నమోదు చేసి వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నాగయ్య మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ కొత్తవేమీ కాకపోయినా వాటిని మరింత కఠినంగా అమలు చేయాలని పోలీసుశాఖ నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా భారీగా ఫైన్లు వేస్తూ కేసులు పెడుతున్నామని నాగయ్య తెలిపారు. ముఖ్యంగా రోడ్లపైన అక్రమంగా పార్కింగ్ చేసే వారిపైన కేసులు నమోదు చేస్తూ కోర్టుకు పంపిస్తున్నట్లు వాహనదారులు జాగ్రత్తగా ఉంటూ నిబంధనలకు లోబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ఉండాలని హెచ్చరించారు.

## మల్టీసౌండ్ హారన్‌పై ప్రత్యేక డ్రైవ్

**బౌద్ధనగర్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** మల్టీసౌండ్ హారన్‌పై శుక్రవారం చిలకలగూడ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది పలు భారీ వాహనాలు, లారీలను ఆపి డ్రైవర్లకు మల్టీసౌండ్ హారన్‌ను ఉపయోగించవద్దని అవగాహన కల్పించారు. మల్టీసౌండ్ హారన్‌ను ఉపయోగిస్తున్న పలు వాహనాలపై కేసులను నమోదు చేశారు. మల్టీసౌండ్ హారన్‌ను ఉపయోగించటం నిషేధించారని, కావున ఆ హారన్‌ను ఇన్‌స్టాల్ చేయవద్దని డ్రైవర్లకు సూచించారు.



అవగాహన కల్పిస్తున్న డీసీ సమ్మయ్య, డీఈఈ శ్రీనివాసరావు, కార్పొరేటర్ కొంతం దీపిక

## మలేరియాపై విద్యార్థులకు అవగాహన

**రెజిమెంటల్‌బజార్, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** వారానికోసారి నీటి నిల్వ పాత్రలను శుభ్రం చేయడం వలన దోమ లార్వాలను అరికట్టవచ్చని డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య అన్నారు. శుక్రవారం జీహెచ్‌ఎంసీ అర్బన్ మలేరియా స్కీమ్ ఎంటమాలజీ ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని వెస్లీ పాఠశాలలో మలేరియా వ్యాధి నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా వ్యాధికి కారణం అయ్యే దోమల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు విద్యార్థులకు వివరించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈఈ శ్రీనివాసరావు, కార్పొరేటర్ కొంతం దీపిక, ఎస్ఎస్.ధనాగౌడ్, జవాన్ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

# 'భూ' మాయ!

- రూ.300 కోట్ల విలువైన భూమికి రెక్కలు
- నిషేధిత జాబితాలో ఉన్నా.. పాస్‌పుస్తకాలు జారీ

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

నగర శివార్లలోని దాదాపు రూ.300 కోట్లకు పైగా విలువ చేసే 33.08 ఎకరాల పోరంబోకు భూములకు రెక్కలు వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న ఈ విలువైన భూములకు కొత్త పాస్‌బుక్‌లు జారీ చేసిన వ్యవహారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఫిర్యాదు రావడంతో భూమిపై జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. మహేశ్వరం మండలం మంఖాల్‌లోని 608, 609, 610 సర్వే నంబర్లలో 33.08 ఎకరాల భూమిని 22ఏ కింద గతంలో నిషేధిత జాబితాలో పెట్టారు. 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో ఈ భూమి పోరంబోకు/గైరానా సర్కారీగా నమోదైంది. ఈ భూముల క్రయవిక్రయాలు జరగకుండా 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం వెబ్‌సైట్‌లో కూడా ఇప్పటికీ ఈ భూమి నిషేధిత జాబితాలోనే ఉంది. అయితే, గత ప్రభుత్వ హయాంలో ఎన్నికలకు ముందు ఈ భూములకు రెక్కలు వచ్చాయి. ఈ భూమి మొత్తం పట్టా భూమిగా మారిపోయింది. దీనికి సంబంధించిన ఫైళ్లన్నీ సచివాలయం వరకు కదిలాయి. కొందరి పేరు మీద పాస్‌బుక్‌లు కూడా ఆగమేఘాలపై జారీ చేశారు. కొందరు రాజకీయ నేతలు, రియల్ ఎస్టేట్ సంస్థల పేర్ల మీదకు ఈ భూమి మారింది. ప్రభుత్వం మారడంతో దీనిపై స్థానికులు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. కొందరు బడా రాజకీయ నేతలు, రియల్ వ్యాపారులు కలిసి ఈ భూములు కొల్లగొట్టారని దీనిపై విచారణ జరపాలని ఆయన ప్రభుత్వానికి, విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులకు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే స్పందించిన జిల్లా కలెక్టర్ శశాంక ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించారు. భూ వివాదాలకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న రెండు టాస్క్‌బృందాల్లో ఒక బృందానికి విచారణ బాధ్యతలు అప్పగించారు. భూ సేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజు నేతృత్వంలోని రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై విచారణ చేపట్టారు. ఇదిలా ఉంటే ఇదే సమయంలో స్థానిక తహసీల్దార్ విజయలక్ష్మి సెలవులో వెళ్లడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న రాజశేఖర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మొత్తం ఈ వ్యవహారంపై డిప్యూటీ కలెక్టర్ రాజు, ఇన్‌చార్జి తహసీల్దార్ రాజశేఖర్ లోతుగా విచారణ జరుపుతున్నారు. మొత్తం ఈ భూమి వ్యవహారంపై రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు తెలిసింది.

### 1975నుంచి రికార్డులు గల్లంతు

మంఖాల్‌లోని ఈ భూములకు సంబంధించిన రికార్డులు కొన్ని గల్లంతైనట్లు అధికారుల ప్రాథమిక విచారణలో తేలింది. అయితే తొలుత ఈ భూమి సేత్వారీలో పట్టాగా ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. తరువాత కొన్నాళ్లు ప్రభుత్వ రికార్డుల్లో అలానే కొనసాగినప్పటికీ 1975నుంచి ఈ సర్వే నంబర్‌కు సంబంధించిన రికార్డులు గల్లంతయ్యాయి. అనుభవదారుల కాలమ్‌లో కొందరు వ్యక్తుల పేర్లు కొనసాగాయి. అయితే, 1996 నుంచి ప్రభుత్వ రికార్డుల్లో పోరంబోకు/సర్కారీ గైరానా అని నమోదవుతూ వస్తోంది. చివరకు 2012లో అప్పటి రెవెన్యూ అధికారులు 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టారు. దీంతో ఈ భూముల జోలికి ఎవరూ వెళ్లలేదు. కానీ, కొందరు పేర్లు మాత్రం అనుభవదారుల కాలమ్‌లో రాశారు. సేత్వారీలో గతంలో పట్టాగా నమోదైందని చెబుతూ దీని ఆధారంగానే మిగతా వ్యవహారమంతా నడిపి ఫైల్ క్లియర్ చేసుకున్నట్లు తెలిసింది.

## 20 నుంచి హైటెక్స్‌లో చేనేత, హస్తకళల ప్రదర్శన

- వెల్లడించిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) సభ్యులు
- ఎంఎస్‌ఎంఈ ప్రోత్సాహం కోసం స్టైల్‌తత్త్వ

**హైదరాబాద్ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి):** మహిళా సాధికారిత, ఎంఎస్‌ఎంఈ రంగాల్లో వ్యాపారాలను నిర్వహిస్తున్న వారిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో), హైదరాబాద్ చాప్టర్ స్టైల్‌తత్త్వ పేరిట ఓ ప్రదర్శనను చేయబోతుంది. ఈనెల 20 నుంచి రెండు రోజులపాటు హైటెక్స్ ప్రాంగణంలో జరిగే ఈ ప్రదర్శన గురించి సోమాజిగూడలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో శుక్రవారం వివరాలు వెల్లడించారు. ఫ్యాషన్ డిజైనర్ నమ్రత జోషిపురా పాల్గొన్న ఈ సమావేశంలో ఫ్లో హైదరాబాద్ చాప్టర్ చైర్‌పర్సన్ ప్రియాగజ్దార్ సహా పలువురు ఫ్లో సభ్యులు, మెంటార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాగజ్దార్ మాట్లాడుతూ.. 'స్టైల్‌తత్త్వ నాల్గవ ఎడిషన్‌ను ఈనెల 20, 21 తేదీలలో హైటెక్స్‌లో నిర్వహించబోతున్నామని, మహిళా సాధికారిత లక్ష్యంగా, ఎంఎస్‌ఎంఈలకు తోడ్పాటు అందించడంలో భాగంగా ఈ ప్రదర్శన చేయబోతున్నామని' తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా వచ్చిన డబ్బుని సామాజిక ప్రభావ కార్యక్రమాల కోసం వినియోగిస్తామని తెలిపారు. దీనిలో భాగంగా 100 మంది రైతులకు ఆధునిక వ్యవసాయంలో శిక్షణ అందిస్తామని తెలిపారు. ఈ ప్రదర్శనలో ప్రత్యేకంగా ఐదు వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ కోసం ఓ పెవిలియన్ ఏర్పాటు చేయడంతో పాటుగా సంప్రదాయం, ఆధునికతల నడుమ అంతరాన్ని పూరించనున్నామని ఫ్లో స్టైల్ తత్త్వ మెంటార్ మంజుల రెడ్డి అన్నారు. మరో మెంటార్ రేఖా లహోటీ మాట్లాడుతూ.. దాదాపు 15 రాష్ట్రాల నుంచి 200 మంది ఎంఎస్‌ఎంఈలు ఈ ప్రదర్శనలో పాల్గొంటాయని తెలిపారు.